క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి రూ. 1.11లక్షల విరాళం



సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన పి.ఆనందరావు అనే దాత లక్ష 11వేల 116 రూపాయల విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ పిళ్లా శ్రీనివాసరావుకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామి దర్శనం కల్పించారు. శేషవస్త్రం, ప్రసాదాన్ని సూపరింటెండెంట్ అందజేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి సన్నిధి చుట్టూ ప్రదక్షిణ చేశారు. క్షీరాభిషేకం నిర్వహించి స్వామిని భక్తి శ్రద్ధలతో కొలిచారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ఆకట్టుకున్న ఫ్యాబ్రిక్ పెయింటింగ్



రూపొందించిన 3డీ ఆర్ట్‌లను ప్రదర్శిస్తున్న ట్రైనీలు

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో పిడిలైట్ సంస్థ ఆధ్వర్యంలో రెండు వారాలుగా జరుగుతున్న ఫ్యాబ్రిక్ పెయింటింగ్ శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. స్కిల్ హబ్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీలు ఫ్యాబ్రిక్ పెయింటింగ్, పూలకుండీల డిజైన్‌లు, క్లే మౌల్డ్ ఆర్ట్, 3డీ ఆర్ట్ లో చక్కటి ప్రావీణ్యాన్ని పొందారు. వారు రూపొందించిన ఆర్ట్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పిడిలైట్ సంస్థ ప్రతినిధి యామిని, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ బి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

పెందుర్తి: పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో డి.నీలవేణి ఓ ప్రకటనలో తెలిపారు. పెందుర్తి మండలం గొరపల్లి, చింతలగ్రహారం-1, సరిపల్లి-2, జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం-1, 64వ వార్డు గొడ్డువానిపాలెం, 77వ వార్డు చిన్నపాలెం, 97వ వార్డు నారవానిపాలెం, 76వ వార్డు కర్ణవానిపాలెం, 75వ వార్డు నెల్లిముక్కు, 85వ వార్డు పెదమడక, 74వ వార్డు దల్లివానిపాలెం కేంద్రాల్లో అంగన్‌వాడీ ఆయా పోస్టుల కోసం ఈ నెల 15 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

బస్సులో గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

పెందుర్తి: ఏజెన్సీ ప్రాంతం నుంచి ఆర్టీసీ బస్‌లో నగరానికి గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పెందుర్తి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న కేజీన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. హైదరాబాద్‌కు చెందిన సుంకరి రోహిత్‌కుమార్, పి.బ్రహ్మాజీ ఏజెన్సీ ప్రాంతం నుంచి నగరానికి ఆర్టీసీ బస్‌లో గంజాయి తరలిస్తున్నారు. వారి నుంచి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

ప్రగతి వీచిక

- నాలుగున్నరేళ్లలో ఎనలేని అభివృద్ధి
- దాదాపు రూ.5.42 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమం ద్వారా ప్రజల ఖాతాల్లో రూ.32.98 కోట్ల జమ



అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఆ పల్లె ఇప్పుడు అభివృద్ధికి కేరాఫ్‌గా మారింది. దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని ఎన్నో సమస్యలు ఈ నాలుగున్నరేళ్లలో పరిష్కారం అయ్యాయి. శిథిలమైన రోడ్లు నేడు మిళమిళ మెరుస్తున్నాయి. పెచ్చులూడి.. పెయింటింగ్ కరిగి కళావిహీనంగా మారిన పాఠశాల నేడు కళకళలాడుతోంది. అభివృద్ధి కళ్ల ముందు కన్పిస్తోంది. మండంలోని వాలిమెరక జుత్తాడ పంచాయతీ ప్రగతి బాట పట్టింది.

పెందుర్తి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వాలిమెరక జుత్తాడ రూపురేఖలు మారాయి. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సహకారంతో సర్పంచ్ బొడ్డు చంద్రవతి ప్రకాష్ సారథ్యంలోవాలిమెరక పంచాయతీ నియోజకవర్గానికి మోడల్‌గా నిలిచింది. అభివృద్ధి పనుల కోసం దాదాపు రూ.5.42 కోట్ల కేటాయించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వాలిమెరక సచివాలయం పరిధిలోని(రాజయ్యపేట పంచాయతీతో కలిపి) లబ్ధిదారులకు రూ.32.98 కోట్లు ఖాతాల్లో చేరాయి. ఇందులో అమ్మ ఒడి పథకం ద్వారా 542 మందికి రూ.2,51,56,654 అందింది.
- జగనన్న విద్యా దీవెన పథకంలో 242 మందికి రూ.1,04,97,383, జగనన్న వసతి దీవెన పథకంలో 206 మందికి రూ.47,15,321 అందాయి.
- వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా 529 మంది రైతులకు రూ.2,39,84,000 నగదు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా 8 మందికి రూ.1,24,529, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా 28 మందికి రూ.27,200 ఖాతాల్లో జమైంది.
- వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా 667 మందికి రూ.6,38,61,750 అవ్వాతాతలకు చేరింది.
- వైఎస్సార్ చేయూత ద్వారా 369 మందికి రూ.1,65,37,500 అక్కచెల్లెమ్మలకు అందింది.
- వైఎస్సార్ ఆసరా(డ్వాక్రా రుణమాఫీ) ద్వారా 937 మందికి రూ.2,34,11,371 నగదు అక్కచెల్లెమ్మల ఖాతాల్లో పడింది.
- వైఎస్సార్ సున్నావడ్డీ పథకం(ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లకు) ద్వారా 1,102 మందికి రూ.20,77,433 నగదు అందింది.
- వైఎస్సార్ ఈబీసీ నేస్తం 29 మందికి రూ.8,10,000 వేలు అందాయి.
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 298 మంది చికిత్స చేయించుకోగా వారికి రూ.1,10,26,182 బిల్లు ప్రభుత్వం చెల్లించింది. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా 151 మందికి రూ.9,47,225 లబ్ధి చేకూరింది.
- హౌసింగ్(లబ్ధిదారులకు నేరుగా చెల్లింపు) ద్వారా 212 మందికి రూ.2,39,05,784 చెల్లింపులు జరిగాయి.
- వైఎస్సార్ బీమా ద్వారా 13 కుటుంబాలకు రూ.20,90, 000 బీమా నగదు చెల్లించి అండగా నిలిచింది ప్రభుత్వం.
- వైఎస్సార్ వాహనమిత్ర ద్వారా 168 మంది ఆటో, ట్యాక్సీ కార్మికులకు రూ.47,40,000 ఖాతాల్లో పడ్డాయి.
- జగనన్న చేదోడు(రజకులు, నాయీబ్రాహ్మణులు, దర్జీలు) 21 మందికి రూ.5,30,000 నగదు చెల్లించి చేయూతనిందించింది.
- జగనన్న తోడు పథకం ద్వారా 116 మందికి రూ.50,775 చెల్లింపులు జరిగాయి.
- ఇవి కాకుండా పరోక్షంగా(నాన్ డీబీడీ పద్ధతిలో) వాలిమెరక పంచాయతీ ప్రజలకు రూ.11.39 కోట్లు లబ్ధి చేకూరింది.

అభివృద్ధికి పెద్దపీట...

- వాలిమెరక జుత్తాడ పంచాయతీలో అభివృద్ధి పనుల కోసం రూ.5.42 కోట్లు వెచ్చించారు.
- నాడు-నేడులో పాఠశాలల అభివృద్ధి, రూరల్ వెల్‌నెస్ సెంటర్‌కు కలిపి రూ.1.96 కోట్లు కేటాయించారు
- గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డిజిటల్ లైబ్రరీ కోసం రూ.61.81 లక్షలు విడుదల అయ్యాయి.
- పంచాయతీలో అంతర్గత రోడ్లు వేయడానికి రూ.98.60 లక్షలు కేటాయించారు.
- ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు రూ.1.66 కోట్లు వెచ్చించారు.



వాలిమెరక జుత్తాడలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ



వాలిమెరకలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



వాలిమెరకలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు



అధ్వానంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



కళకళలాడుతున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

జగనన్న ఎంతో మేలు చేశాడు



నేను డ్వాక్రా సభ్యురాలిని. 2019కి ముందు అవసరం కోసం రూ.లక్ష రుణం తీసుకున్నాను. జగనన్న ముఖ్యమంత్రి కాగానే నాలుగు దశల్లో ఆ రుణాన్ని మాఫీ చేశాడు. అంతే కాకుండా సంక్షేమ పథకాల ద్వారా గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఎంతో మేలు జరిగింది. పాఠశాలలను ఎంతో అందంగా తీర్చిదిద్దారు. జగనన్న మళ్లీ వస్తే ఇంకా మేలు జరుగుతుందని నమ్ముతున్నాం.

– కునిగంటి అచ్చితల్లి,
వైఎస్సార్ ఆసరా లబ్ధిదారు,
వాలిమెరక జుత్తాడ

మా కల నెరవేరింది



గతంలో ఇంటి స్థలం కోసం ఎన్నో సార్లు దరఖాస్తు చేశాం. అయినా మంజూరు కాలేదు. జగనన్న ముఖ్యమంత్రి కాగానే వలంటీర్ ఇంటి స్థలం కోసం దరఖాస్తు తీసుకున్నారు. కొద్దిరోజులకే మాకు ఇంటి స్థలం వచ్చినట్లు ధ్రువపత్రం ఇచ్చారు. జగనన్న కాలనీలో ప్రస్తుతం ఇల్లు కట్టుకుంటున్నాం. మా కల నెరవేర్చిన జగనన్నకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

– అప్పికొండ అన్నపూర్ణ,
జగనన్న కాలనీ ఇంటి స్థలం లబ్ధిదారు,
వాలిమెరక జుత్తాడ

అభివృద్ధికి మారుపేరుగా నిలిచింది



గతంలో మా పంచాయతీలో అభివృద్ధి అంతంత మాత్రమే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మా పంచాయతీ రూపురేఖలు మారిపోయాయి. మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆధునికీకరించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రోడ్లు దాదాపు పూర్తయ్యాయి. సంక్షేమం, అభివృద్ధిలో కూడా మా పంచాయతీ ముందుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు ధన్యవాదాలు. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని మేమంతా కోరుకుంటున్నాం.

– బొడ్డు చంద్రవతి ప్రకాష్,
సర్పంచ్, వాలిమెరక జుత్తాడ

థీమ్ పార్క్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



పార్కు పనులపై అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు రత్నగిరినగర్‌లో నిర్మాణంలో ఉన్న స్పోర్ట్స్ థీమ్ పార్కును త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తేవాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులకు సూచించారు. పార్కు నిర్మాణ పనులు మందకొడిగా సాగడంతో కాంట్రాక్టర్‌పై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం పార్కును కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరుకు పార్కును ఎట్టిపరిస్థితిలోనూ అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు ఆహ్లాదం కలిగించే పార్కుల అభివృద్ధికి జీవీఎంసీ కట్టుబడి ఉందన్నారు. పార్కుల్లో విద్యుత్ దీపాలు, పచ్చదనం, రంగులు, వాటర్ ఫౌంటెయిన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. కమిషనర్ వెంట జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ రామ్మోహనరావు, ఏడీహెచ్ చక్రవర్తి, జోనల్ కమిషనర్ హైమావతి, ఏసీపీ వెంకటేశ్వర్లు, కార్య నిర్వాహక ఇంజనీర్ రమణ, ఏఈ సురేష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తున్న డిపో మేనేజర్ రాజశేఖర్ తదితరులు

సింహాచలం: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రాజశేఖర్ కోరారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డిపోమేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రోడ్లపై ప్రయాణించే వారు విధంగా నిబంధనలు పాటించాలన్నారు. సెల్‌ఫోన్ వినియోగం, సిగ్నల్ క్రాసింగ్, రోడ్డు దాటుతున్నప్పుడు నిర్లక్ష్యంగా ఉండటం, అతివేగం రోడ్డు ప్రమాదాలకు కారణమని తెలియజేశారు. గణాంకాలను బట్టి గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువగా పాదచారులు, దిచక్రవాహనదారుల ప్రమాదాలకు గురయ్యారని వెల్లడించారు. పిల్లలు రోడ్లపై నడుస్తున్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సాయితులసి, మెకానికల్ ఇన్‌చార్జి కె.కొండలరావు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ కె.కుమారి, హెచ్‌ఎం భాను తదితరులు పాల్గొన్నారు.

'పది'లో శతశాతం ఫలితాలు సాధించాలి

డిప్యూటీ డీఈవో అప్పారావు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

పరవాడ: సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపు ఉందని.. దాన్ని తమ పనితీరుతో మరింత పెంపొందించుకోవాలని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు అన్నారు. మండలంలోని వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలను మంగళవారం సందర్శించారు. టెస్ట్ విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయులతో చర్చించారు. పది పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. నాణ్యత, రుచి ఎలా ఉంటుందని విద్యార్థులను ఆరా తీశారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, గుణాత్మక విద్య, ఎల్‌బీపీ, తదితర కార్యక్రమాలపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.కనకేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉక్కు' పోరాటంలో విజయం కార్మికులదే..

- విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 1090వ రోజుకు రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు సంకల్పంతో నిర్విరామంగా కార్మికులు చేస్తున్న పోరాటంలో అంతిమ విజయం కార్మికులనే వరిస్తుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 1090వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో మంగళవారం ఉక్కు నిర్వాసితులు, సంస్థకు చెందిన ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టీఎం విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు కార్మిక వర్గం మొక్కవోని దీక్షతో నిరసన తెలియజేస్తున్నా కేంద్రప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. పోరాట కమిటీ నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.

కరాటే పోటీల విజేతలకు అభినందన



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: విశాఖలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ ఎస్. సీతాలక్ష్మి తెలిపారు. పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఆషాబిజిలీ వెండి పతకం, 7, 9 తరగతులు చదువుతున్న ఆష్మాన్‌గుప్తా, యువరాజ్ కాంస్య పతకాలు సాధించారని పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం పాఠశాల సీఈవో కె.నిశాంత్, పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, అభినందనలు తెలిపారు. కోచ్ లోహిత్, వ్యాయామ ఉపాధ్యాయులు మనీష్, బషీర్, రాజేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్ శ్యాంప్రసాద్‌కు సాదర వీడ్కోలు



తహసీల్దార్ శ్యాంప్రసాద్‌కు జ్ఞాపిక అందిస్తున్న వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది

పెందుర్తి: విజయనగరం జిల్లా భోగాపురం మండలానికి బదిలీ అయిన తహసీల్దార్ శ్యాంప్రసాద్‌ను కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో శ్యాంప్రసాద్‌కు జ్ఞాపికలు అందించి సాదర వీడ్కోలు పలికారు. వీఆర్వోల సంఘం విశాఖ డివిజనల్ అధ్యక్షుడు సుబ్బారావు, వీఆర్వో ముత్యాలశెట్టి, కార్యాలయసిబ్బంది పాల్గొన్నారు.

'రోజుకో సర్క్యులర్‌తో కార్మికుల్లో ఆందోళన'



స్టీల్‌ప్లాంట్ వర్క్స్ సీజీఎం సోఫ్టీకి వినతిపత్రం అందజేస్తున్న సిటూ నాయకులు

ఉక్కునగరం: కార్మికుల్లో భయాందోళన కలిగిస్తున్న చర్యలను ఉక్కు యాజమాన్యం తక్షణం ఆపాలని స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి.దాస్ డిమాండ్ చేశారు. బయోమెట్రిక్‌కు వ్యతిరేకంగా స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం రోజుకో సర్క్యులర్ ద్వారా కార్మికుల్లో ఆందోళన కలిగిస్తూ ఉక్కు ఉత్పత్తికి అంతరాయం కలిగించే విధంగా చర్యలు చేపడుతోందన్నారు. కార్మిక సమస్యలను పక్కతోవ పట్టించేందుకు బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెడుతోందని విమర్శించారు. తక్షణం బయోమెట్రిక్‌ను విరమించుకోవాలన్నారు. మిత్రపక్షాల నాయకులు డి.వి.రమణ, సన్యాసిరావు, కర్రా ప్రకాశ్ మాట్లాడుతూ కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలతో ఇబ్బంది పెడుతోందన్నారు. ఈ అంశంపై గుర్తింపు యూనియన్ స్పష్టమైన విధానంతో పోరాటానికి పిలుపు ఇస్తే, తాము మద్దతు ఇస్తామన్నారు. అనంతరం సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోఫ్టీకి వినతిపత్రం అందజేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేంచేయజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించి భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల

సబ్బవరం: సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్‌వీవీ సత్యారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి,ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలోని 8 గురుకుల పాఠశాలలకు గాను 3 బాలుర, 5 బాలికల గురుకులాల్లో ఈ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సబ్బవరం గురుకులంలో 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 80 సీట్లకు గానూ సీఈసీలో 40, ఎంఈసీలో 40 సీట్లు ఉన్నాయన్నారు.2023-24 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. తెలియజేసారు.అర్హత కలిగిన విద్యార్థులు ఆధార్ కార్డు,రేషన్ కార్డుతో దగ్గరలోని ఇంటర్నెట్ సెంటర్ ద్వారా లేదా నేరుగా పాఠశాలకు వస్తే దరఖాస్తు చేస్తామని పేర్కొన్నారు.

అలరించిన అన్నమాచార్య కీర్తనలు



వీణ కచేరీ ప్రదర్శన చేస్తున్న కళాకారిణులు

ఎంవీపీ కాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శ్రీఐశ్వర్యలక్ష్మీ సౌభాగ్య లక్ష్మీ, సమేత వల్లభ వేంకటేశ్వర కల్యాణ ఉత్సవ ఆధ్యాత్మిక పీఠం వైభవోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వల్లభ వేంకటేశ్వర ఆధ్యాత్మిక పీఠం, వైదిక విజ్ఞాన విపంచి, విశాఖ సాగరతీర కార్తీక దీపోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మంగళవారం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ వారి అన్నమాచార్య కీర్తనలు అందరినీ అలరించాయి.